

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 569.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,633 క్యూసెక్కులు వదిలారు.



వైభవంగా దీపోత్సవం

నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం కుత్తువిళక్కు-విశేష పాశురం, దీపోత్సవం నిర్వహించారు.



వేడుకగా కల్యాణ మహోత్సవాలు

గుంటూరురూరల్: గోరంట్లలోని వేంకటేశ్వర స్వామి పెద్ద గుడిలో దశావతార కల్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామిని వామనావతారంలో అలంకరించారు.

న్యూస్‌రీల్

వైభవంగా ధనుర్మాస మహోత్సవాలు



తాడేపల్లి రూరల్ : త్రిదండి చిన్న జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ధనుర్మాస వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మంగళగిరి బాపూజీ విద్యాలయంలో 19వ రోజు 19వ పాశురాన్ని భక్తులకు ఆయన వివరించారు. అనంతరం గోదా అమ్మవారికి అష్టోత్తరం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా సీతానగరం జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ.. పలు ప్రాంతాల నుండి సుమారు 700 మంది భక్తులు గోదా అమ్మవారికి సారె సమర్పించారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి.

మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్షలు



నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 216 మంది హాజరయ్యారు. 26 మందికి ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనక్కు పంపారు. మిగతా వారిలో 10 మందికి బరువు, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. 113 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో 5 మంది, 113 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా 106 మంది అర్హత పొందారు. మొత్తమ్మీద 198 మందికి దేహదారుఢ్య పరీక్షలు జరగ్గా, 106 మంది అర్హత సాధించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (క్రైం), ఎ.హనుమంతు(ఏఆర్), సిబ్బంది పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన స్కేటింగ్ క్రీడాకారిణి



తాడేపల్లి రూరల్: మంత్రి నారా లోకేష్‌ను మంగళగిరికి చెందిన స్కేటింగ్ క్రీడాకారిణి మాత్రపు జెస్సీ రాజ్ శుక్రవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జెస్సీ రాజ్ ఇటీవల రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు అందుకుంది. స్కేటింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందుకు ఈ పురస్కారం దక్కింది. ఆమెను మంత్రి అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

జీఎన్‌ఎమ్ వార్షిక పరీక్షలు ప్రారంభం



గుంటూరు మెడికల్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్‌ఎమ్) వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గుంటూరు మెడికల్ కాలేజ్, ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో జిల్లా వ్యాప్తంగా 36 నర్సింగ్ స్కూల్స్ నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 11 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. తొలిరోజు పరీక్షలకు 1500 మందికిగాను ఫైనల్ ఇయర్ విద్యార్థులు 20 మంది, ఫస్ట్ ఇయర్ వారు 94 మంది గైర్హాజరైనట్లు గుంటూరు జీజీహెచ్ ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ కోటా సుజాత తెలిపారు. పరీక్షల చీఫ్ ఎగ్జామినర్‌గా గుంటూరు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు.

శుభ సన్‌కల్పం

సౌర కాంతికి స్వాగతం పలకండి

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్తి బిజిలీ యోజన అమలుకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. నిర్దేశిత లక్ష్యసాధనకు ఆర్థికంగానూ ప్రోత్సాహకాలు అందిస్తోంది. పట్టణ, గ్రామీణ స్థాయిలో గృహ భవనాలపై సౌర పలకల ఏర్పాటు నిమిత్తం లబ్ధిదారులకు రాయితీలను ప్రకటించింది. ఐదు వేలకుపైగా జనాభా కలిగిన పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. ఆయా చోట్ల సౌర పలకల ఏర్పాటులో పోటీ వాతావరణం కల్పించడంతో పాటు స్థానికులను భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో నజరానా అందజేయనుంది. మార్చి నెలాఖరు లోపు లక్ష్యం సాధించిన గ్రావ ఎపంచాయతీ ఖజానాకు రూ.కోటి నగదు జమ చేయనుంది.

- మీలో ఎవరు కోటీశ్వరులు!
- లక్ష్యం సాధించిన గ్రామ పంచాయతీకి రూ.కోటి బహుమతి
- పీఎం సూర్యఘర్ పైలట్ ప్రాజెక్టుకు జిల్లాలో 5 గ్రామాలు ఎంపిక
- జిల్లాలో ప్రధానమంత్రి సూర్యఘర్ అమలుకు విస్తృత ప్రచారం
- ఇప్పటి వరకు 12,249 మంది దరఖాస్తు



ఇంటిపై ఏర్పాటు చేసిన సౌర పలకలు

సత్తెనపల్లి: పల్లె .. పట్టణం .. నగరం అనే తేడా లేకుండా విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏటా ఎదురవుతున్న వెతలను అధిగమించేందుకు సహజ వనరుల(నీరు, బొగ్గు)ను రక్షించుకుని ప్రకృతిని సంరక్షించాలనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా రాయితీపై సౌర విద్యుత్ పలకలను అందిస్తోంది. తాజాగా ఐదు వేలకుపైగా జనాభా గల పంచాయతీలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. మార్చినెలాఖరులోపు ఆయా గ్రామాల్లో నూరు శాతం లక్ష్యం సాధించిన పంచాయతీ ఖజానాకు రూ. కోటి నజరానాగా జమ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. పల్నాడు జిల్లా పరిధిలో గృహ విద్యుత్ సర్వీసులు 4,67,224 ఉన్నాయి. వీటి ద్వారా నెలకు రూ.19 కోట్ల మేర విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. ఈ భారం తగ్గించేందుకు వంద శాతం సౌర పలకలు ఏర్పాటవ్వాలన్న సంకల్పంతో జిల్లాలో ఐదు పంచాయతీలను ఆదర్శ గ్రామాలుగా ఎంపిక చేశారు. వాటిలో నరసరావుపేట మండలం యల్లమంద, దుర్గి మండలం ముటుకూరు, వినుకొండ మండలం చీకటీగలపాలెం, మాచవరం మండలం మొర్జంపాడు, ముప్పాళ్ళ మండలం తురకపాలెం ఉన్నాయి. సౌర విద్యుత్ పథకం అమలు లక్ష్యాన్ని దిగ్విజయంగా సాధించిన గ్రామానికి రూ.కోటి ఆర్థిక ప్రోత్సాహకాన్ని కేంద్రం ఇవ్వనుంది.

మీకూ సౌర విద్యుత్ కావాలా..!

సౌర విద్యుత్ సౌకర్యం కావాల్సిన వారు ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలి. ఇందులో వెండర్ల (కాంట్రాక్టర్ల) వివరాలు ఉంటాయి. మనకు నచ్చిన వారిని ఎంచుకోవాలి. మన ఇంటికి ఎన్ని కిలోవాట్ల మేర విద్యుత్ అవసరమో ఎంచుకొని .. నమోదు చేసుకోవాలి. ఇందులో ఒకటి నుంచి రెండు, మూడు కిలో వాట్ల వరకు పథకం వర్తింపజేస్తారు. పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు 12,249 దరఖాస్తులు రాగా, 111 ఇళ్లకు ఇన్‌స్టాల్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు.

మిగులుకు నగదు చెల్లింపు

ఇళ్లపై బిగించిన సౌర పలకల నుంచి విద్యుదుత్పత్తి అయి, నేరుగా తీగల ద్వారా విద్యుత్ నియంత్రికలకు వెళ్తాయి. అక్కడి నుంచి తిరిగి ఇళ్ల సర్వీస్ తీగల నుంచి సరఫరా అవుతాయి. ఇందుకు మధ్యలో విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక మీటర్ బిగిస్తారు. ఈ మీటరు మన ఇంటి నుంచి ఎన్ని యూనిట్లు సౌర విద్యుత్ ఉత్పత్తి అయింది? ఎంత వినియోగించాం? మిగులు ఎంత? అనే లెక్కలు నమోదు అవుతాయి. విద్యుత్ శాఖ ఆరు నెలలకోసారి లెక్కించి యూనిట్‌కు మార్కెట్ ధరను బట్టి (ప్రస్తుతం రూ.2.90) వినియోగదారుని బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. ఒకవేళ సౌర విద్యుత్ ఉత్పత్తి కంటే .. అధికంగా వినియోగిస్తే వాటికి వినియోగదారుడు బిల్లు చెల్లించాలి. ఇక విద్యుత్ కోతల సమయంలో సాధారణ సర్వీస్‌లానే కోత ఉంటుంది.

స్థలం తక్కువ.. ప్రయోజనం అధికం..

సౌర విద్యుత్ వినియోగానికి స్థలం తక్కువ.. ప్రయోజనాలు అధికంగా ఉన్నాయి. ఇందుకు అనువైన మేడ ఉంటే చాలు. ఒక కిలోవాట్‌కు 8–10, రెండు, మూడు కిలో వాట్లకు 10–12 కొలతల్లో స్థలం ఉండాలి. ఒక సౌరపలక 50 వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. ఈ లెక్కన ఒక కిలోవాట్‌కు రెండు, రెండుకు నాలుగు, మూడు కిలోవాట్లకు ఆరు సౌరపలకలు అమరుస్తారు. ఒక కిలోవాట్ సౌరపలక రోజుకు 4 యూనిట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. అంటే నెలకు 120 యూనిట్లు. రెండు కిలోవాట్ల పలక రోజుకు 8 యూనిట్ల చొప్పున నెలకు 240, మూడు కిలోవాట్ల పలక రోజుకు 12 యూనిట్లు చొప్పున నెలకు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి.

అవగాహన కల్పిస్తున్నాం

నూరు శాతం సౌరపలకలు ఏర్పాటు చేసిన పంచాయతీ విజేతగా నిలుస్తుంది. మార్గదర్శకాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం రూ.కోటి బహుమతిగా ఇస్తుంది. సౌరపలకలతో విద్యుత్ ఆదా, బిల్లు తగ్గింపు అంశాలపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. దరఖాస్తులను ప్రధాన మంత్రి సూర్య ఘర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా అమర్చనుండగా మిగతా వారికి రాయితీ ఇవ్వనుంది. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి సౌర విద్యుత్ పలకలను ఏర్పాటు చేసుకోవాలి.

–కె.రామసుబ్బారావు,
ఈఈ టెక్నికల్, విద్యుత్ శాఖ, పల్నాడు

కిలోవాట్	విద్యుత్ ఉత్పత్తి (యూనిట్లు)	విద్యుత్‌బిల్లు (రూ.)	సౌరబిల్లు (రూ.)	ఏడాదికి ఆదా (రూ.)	కేంద్రం రాయితీ (రూ.)
1	120	1,000	338	8,000	30,000
2	240	2,000	333	20,000	60,000
3	360	3,000	293	32,400	78,000

రెవెన్యూ అధికారులపై ఫోర్జరీ కేసు

మేదరమెట్ల: కోర్టు ఉత్తర్వులను ధిక్కరించిన రెవెన్యూ అధికారులపై ఫోర్జరీ కేసు నమోదైంది. కొరిశపాడు మండలం మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో గత నెల 30న తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, వీఆర్వో సహా మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మహ్మద్ రఫీ వివరాల మేరకు.. మేదరమెట్ల గ్రామానికి చెందిన మార్పూడి వెంకటేశ్వర్లుకు ఆదే గ్రామానికి చెందిన నెక్కంటి సుబ్బారావు నగదు ఇవ్వాలి. పాత బకాయిల విషయంపై 2023 మార్చి 23న ఒంగోలు కోర్టులో వెంకటేశ్వర్లు దావా వేశాడు. దీంతో కోర్టు సుబ్బారావుకు చెందిన 575/33సీ-1 సర్వేలో ఉన్న 44 సెంట్ల భూమిని అటాచ్ చేస్తూ తీర్పు ఇచ్చింది. ఈ విషయాన్ని బాధితుని తరఫు న్యాయవాది అద్దంకి సబ్ రిజిస్ట్రార్, కొరిశపాడు తహసీల్దార్‌కు తెలిపారు. కోర్టు అటాచ్ చేసిన అంశాలకు సంబంధించి మార్పులు చేయకూడదనే నిబంధన ఉన్నా రెవెన్యూ అధికారులు ఆదేశాలను ధిక్కరించి 2023 జూన్ 28న సుబ్బారావుకు 85 సెంట్ల భూమి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించారు. దీనిపై బాధితుడి తరఫు న్యాయవాది అద్దంకి కోర్టులో పిటిషన్ వేశారు. దీంతో కోర్టు ఆదేశానుసారం అప్పటి సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్, వీఆర్వోతో పాటు మరో ఆరుగురిపై ఫోర్జరీ కేసు నమోదు చేసి నోటీసులు అందజేయనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యార్డులో 45,194 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 40,012 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 45,194 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.16,200 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.7,500 నుంచి రూ. 14,000 వరకు లభించింది.

నేడు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

- ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో నిర్వహణ
- సన్నాహక సమావేశం నిర్వహించిన డీఈఓ చంద్రకళ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

నరసరావుపేట రూరల్: జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శనను ఈనెల 4వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు నరసరావుపేటలోని ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనన సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రకళ మాట్లాడుతూ ప్రదర్శన నిర్వహణకు ప్రధానోపాధ్యాయులు చైర్మన్లుగా, నలుగురు సభ్యులతో 13 కమిటీలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జిల్లాలోని 28మండలాల నుంచి విద్యార్థులు వివిధ విభాగాలలో ప్రదర్శనలో పాల్గొంటారని పేర్కొన్నారు. మండల స్థాయిలో వ్యక్తిగత, గ్రూప్‌టీమ్‌లు, ఉపాధ్యాయుల నమూనాలు ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. 8,9,10 తరగతులు ఒక్కొక్క విద్యార్థి చొప్పున 28 మండలాల నుంచి క్విజ్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, గణితం, జీవశాస్త్రం, భూవిజ్ఞానశాస్త్రం, పర్యావరణశాస్త్రం,ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అంశాలకు సంబంధించి వ్యక్తిగత గ్రూపు, ఉపాధ్యాయుల విభాగాలలో నమూనాలు ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా పుస్తక ప్రదర్శనను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో మూడు విభాగాల నుంచి ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన వారు జనవరి 7,8 తేదీలలో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.గోవిందరాజులు, బీఏవిఎల్ వరప్రసాద్, టి.రవికాంత్, కె.వెంకట్రావు, ఎం.రామారావు, వై.హనుమంతరావు, నగేష్, సిహెచ్.వీరప్పయ్య, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్, మాజీ డీఎస్‌వో ఏఏ మధుకుమార్, వి.సీతారామయ్య పాల్గొన్నారు.

వివాహేతర సంబంధానికి ప్రాణం బలి

దారుణంగా చంపిన ప్రియురాలి భర్త



రక్తపు మడుగులో పడి ఉన్న పాలపర్తి నాగరాజు

చిలకలూరిపేటటౌన్: వారిద్దరిలో ఒకరికి పెళ్లీడుకొచ్చిన పిల్లలుంటే, మరొకరికి అల్లుళ్లు సైతం ఉన్నారు. అయినా వారి వివాహేతర బంధం వీడలేదు. పలుమార్లు ఎందరో నచ్చజెప్పినా వినలేదు. చివరకు ఆ సంబంధం ఒకరి ప్రాణాలను బలిగొంది. చిలకలూరిపేట పట్టణంలో గురువారం రాత్రి జరిగిన ఈ దారుణ ఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక శాంతినగర్ వాసి, మినీ ఆటో డ్రైవర్ పాలపర్తి నాగరాజు అలియాస్ తిమ్మిరి(45) డైక్‌మెన్ నగర్‌కు చెందిన ఓ పాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న అక్కల చెంచయ్య భార్య నన్నీతో మూడేళ్ల కిందట వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. పలుమార్లు ఇద్దరూ తమ కుటుంబాలను విడిచి వెళ్లిపోయిన ఘటనలు ఉన్నాయి. నన్నీకి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అల్లుళ్లూ వచ్చారు. నాగరాజుకు పెళ్లీడు కొచ్చిన పిల్లలు ఉన్నారు. అతడి భార్య నాగమ్మ ఇళ్లల్లో పాచిపనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. నన్నీ, నాగరాజుకు సంఘ పెద్దలు, పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా వారిలో ఎలాంటి మార్పూ రాలేదు. పైగా సుభాని నగర్ వాగు సమీపంలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. దీంతో నాగరాజుపై నన్నీ భర్త చెంచయ్య కక్ష పెంచుకున్నాడు. తన అన్న కుమారుడు అక్కల ప్రభుదాసుతో కలిసి హత్య చేసేందుకు ప్రణాళిక రూపొందించాడు. అక్కయ్య కుమారుడితో కలిసి నన్నీ, నాగరాజు ఉండే ప్రాంతానికి వెళ్లారు. అదే సమయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో ఉన్న నన్నీ తమ్ముడికి భోజనం ఇచ్చేందుకు క్యారేజీ తీసుకుని నాగరాజు, నన్నీ బయలుదేరారు. దీంతో ప్రభుదాసు, చెంచయ్య వారిని అడ్డగించారు. నన్నీని అక్కడి నుంచి పంపివేశారు. వెంటనే నాగరాజును రేకుల షెడ్డులోకి లాక్కెళ్లి కూరగాయల చాకుతో గొంతుకోసి హత్యచేసి పరారయ్యారు. హత్య అనంతరం నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. నాగరాజు భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1716 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 140, తూర్పు కెనాల్‌కు 174, నిజాంపట్నం కాలువకు 34, కొమ్మమూరు కాలువకు 975 క్యూసెక్కులు విడుదల చేశారు.

సర్కారు ప్రేక్షకపాత్ర

వంట పాత్రలకూ ప్రిన్సిపాల్స్‌దే భారం

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమల్లో గందరగోళం
- వంట సామగ్రి సరఫరా చేయకుండానే హడావుడి
- నేటి నుంచి జిల్లాలోని 9 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అమలు!



పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు

సత్తెనపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామంటూ గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి చూపించడం లేదు. తొలుత జనవరి ఒకటో తేదీ నుంచి ఈ పథకాన్ని ప్రారంభిస్తామని సర్కారు ప్రకటించింది. మళ్లీ జనవరి 3వ తేదీ అని.. ఆ తర్వాత 4వ తేదీ నుంచి అమలు చేస్తామని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం అమలుకు కావాల్సిన వంట పాత్రలతోపాటు విద్యార్థులు భోజనం చేసేందుకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులను ప్రిన్సిపాల్‌లు కొనుగోలు చేయాలని పేర్కొంది. దీంతో కళాశాలల ప్రిన్సిపాల్‌లు విద్యార్థుల సంఖ్యను బట్టి సుమారు రూ.10 వేల వరకు ఒక్కో కళాశాలలో ఖర్చు చేసి కొనుగోలు చేశారు. అవి ఇంకా పూర్తిస్థాయిలో కళాశాలలకు చేరుకోలేదు. అత్యవసరమైన ప్లేట్లు, గ్లాసులు, ఆహారం తీసుకు వచ్చే పెద్ద బాక్స్‌లు మాత్రమే వచ్చాయి. ఏజెన్సీలకు అందించాల్సిన వంట సామగ్రి ఇంకా రావాల్సి ఉంది. వాటిని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పాఠశాల హెచ్‌ఎంల ద్వారా అందజేయాల్సి ఉంది. ముందుగా ప్రిన్సిపల్స్ తన సొంత నిధులు ఖర్చు చేసి ఆ తర్వాత కళాశాల పీడీ అకౌంట్స్ లేదా కళాశాల స్పెషియల్ ఫండ్ కింద బిల్లులు పెట్టుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికే కళాశాలల నిర్వహణ కోసం ప్రిన్సిపాల్‌లు ఖర్చు చేసిన స్టేషనరీ తదితర బిల్లులు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. మళ్లీ ఈ అదనపు భారం ఏమిటని ప్రిన్సిపాల్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలో సత్తెనపల్లి, వినుకొండ, గురజాల, మాచర్ల, పిడుగురాళ్ల, దుర్గి, దాచేపల్లి, బెల్లంకొండ, అచ్చంపేటలో మొత్తం తొమ్మిది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యనభ్యసించే విద్యార్థులు 870 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 724 మంది వెరసి 1,594 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ శనివారం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాల్సి ఉంది.

సమీప ఉన్నత పాఠశాలల నుంచే..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే వారంతా పేద, మధ్యతరగతి విద్యార్థులే. వీరంతా సమయానికి తరగతులకు హాజరు కావాలన్నా, ఇతర ఇబ్బందులను అధిగమించాలన్నా, పేదరికం వల్ల ఇంటి దగ్గర నాణ్యమైన ఆహారం అందని పరిస్థితి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు భోజన సదుపాయం తోడ్పాటునివ్వనుంది. అయితే అమలుకు వారం రోజులు ముందుగానే అవసరమైన సామగ్రి అందించాల్సి ఉన్నా ఆ పని మాత్రం సర్కారు చేయలేదు. పైగా ఊదరగొట్టే రీతిలో ప్రచారం చేసుకోవడం గమనార్హం. కాలేజీల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ సమీపంలోని ఉన్నత పాఠశాలలో ఉన్న ఏజెన్సీలకే అప్పగించారు. దీనికోసం ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌తో సమన్వయ సమావేశం కూడా ఇటీవల నిర్వహించారు.



మధ్యాహ్న భోజనానికి ఓ ప్రిన్సిపాల్ కొనుగోలు చేసిన పేట్లు, గ్లాసులు

1999 బ్యాచ్ వైద్య విద్యార్థుల సేవలు ఆదర్శం

మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరు మెడికల్ : గుంటూరు వైద్య కళాశాల 1999 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు ఆదర్శంగా నిలిచారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థుల కోసం ఆ బ్యాచ్ ఇచ్చిన రూ. 80 లక్షల విరాళంతో కొనుగోలు చేసిన రెండు బస్సులను మంత్రి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వవిద్యార్థుల సేవాగుణం అభినందనీయం అన్నారు. ఇప్పటివరకు రూ. 2 కోట్ల మేర విరాళం అందించడం ఆదర్శనీయం అని తెలిపారు. తర్వాత వారిని మెమోంటోలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, పూర్వ విద్యార్థులు బాహుబలి సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ ప్రభాకరరావు, డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కత్వా చెరువు పరిరక్షణకు చర్యలు

- కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించిన అధికారులు
- ఆక్రమణలు తొలగించాలని ఆర్డీఓను కోరిన ఇరిగేషన్ శాఖ
- మున్సిపల్, రెవెన్యూ అధికారులతో బృందం ఏర్పాటు
- వారంలో ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం

సాక్షి ఎఫెక్ట్

నరసరావుపేటటౌన్: కత్వా చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని మైనింగ్ ఇరిగేషన్ శాఖ అధికారులు ఆర్డీఓను కోరారు. ఈ మేరకు శుక్రవారం లేఖ రాశారు. కత్వా చెరువులో విలువైన కొంత భూమిని టీడీపీ నాయకులు కబ్జా చేసి జేసీబీతో చదును చేసిన వైనంపై 'ఆరాచ'కత్వా'నికి పరాకాష్ట' అన్న శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అక్రమార్కులు ఆక్రమించేందుకు చదును చేసిన బరంపేట శివారు ప్రాంతాన్ని మైనింగ్ ఇరిగేషన్ శాఖ డీఈ శ్రీనివాసరావు, ఏఈ కిరణ్‌లు సిబ్బందితో పరిశీలించారు. కబ్జా చేసేందుకు అక్కడ ఉన్న పిచ్చి చెట్లను తొలగించి ఉండటాన్ని గమనించారు. గత ప్రభుత్వ హయాంలో కత్వా చెరువు అభివృద్ధికి రూ.5.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. డీపీఆర్ పూర్తయి త్వరలో టెండర్ పిలవనున్నారు. ఈ క్రమంలో కత్వా చెరువులో నెలకొన్న ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని మైనింగ్ ఇరిగేషన్ శాఖ ఆర్డీఓకు పంపిన లేఖలో పేర్కొన్నారు. ఈ విషయంపై ఆర్డీఓ మధులత మాట్లాడుతూ మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులతో బృందాన్ని ఏర్పాటు చేసి కత్వా చెరువులో ఆక్రమణలను తొలగిస్తామన్నారు. ఆక్రమణలను గుర్తించి నోటీసులు ఇవ్వాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వారంలో బృందాన్ని అక్కడకు పంపించి పూర్తి స్థాయిలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపడతామని చెప్పారు.

క్రికెట్ పోటీల చాంపియన్‌గా విజ్ఞాన్ వర్సిటీ


టీం సభ్యులను అభినందిస్తున్న వీసీ పి.నాగభూషణ్ తదితరులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ గ్రౌండ్‌లో 18వ ఎడిషన్ మహోత్సవ్-2కే25లో భాగంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్ విజేతగా విజ్ఞాన్ వర్సిటీ నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో నరసరావుపట ఇంజినీరింగ్ కళాశాలపై విజ్ఞాన్ జట్టు 25 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన విజ్ఞాన్ జట్టు నిర్ణీత 14 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజీ జట్టు 6 వికెట్లు కోల్పోయి 74 పరుగులు మాత్రమే చేసింది. బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీపై ఎస్ఆర్ఐ ఇంజినీరింగ్ కాలేజీ జట్టు 16 పరుగుల తేడాతో గెలిచి మూడో స్థానంలో నిలిచింది. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో పాటు విన్నర్‌కు రూ. 50వేలు, రన్నర్‌కు రూ.30 వేలు, మూడో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, నాలుగో స్థానం పొందిన జట్టుకు రూ.10 వేల వంతున నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక మందిరం.. అభివందనం

శత వార్షికోత్సవానికి ముస్తాబైన ముగ్గురు రాజులు దేవాలయం
- 1925 ఆగస్టు 15న ప్రతిష్ట
- దక్షిణ భారతదేశంలోనే మూడో పెద్ద ఎత్తైన క్రైస్తవ ఆలయంగా గుర్తింపు
- నేటి నుంచి వేడుకలకు ఏర్పాట్లు


ముగ్గురు రాజులు దేవాలయం


దేవాలయం లోపలిభాగం

శత వార్షికోత్సవ లోగో

పెదకూరపాడు: దక్షిణ భారత దేశంలో మూడో పెద్ద, ఎత్తైన క్రైస్తవ దేవాలయంగా గుర్తింపు పొందిన పాటిబండ్ల ముగ్గురు రాజులు మందిరం శత వసంతాల వేడుకకు ముస్తాబవుతోంది. శనివారం నుంచి ఆరో తేదీ వరకు జరగనున్న ఈ వేడుకల్లో పాల్గొనేందుకు దేశ, విదేశాల నుంచి వేలాది మంది కతోలికలు తరలివస్తున్నారు. దీనికోసం అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి.

1925లో ప్రతిష్ట

గుంటూరు పీఠంలోని పాటిబండ్లలో ముగ్గురు రాజులు ఆలయం 1925లో అప్పటి మద్రాసు అతి మేత్రాసనులు మహాఘన జాన్ పెన్నలి చేతుల మీదుగా విచారణ గురువు జాన్‌గైస్మాన్ పర్యవేక్షణలో ప్రతిష్టితమైంది. 1928లో ఈ ఆలయానికి 120 అడుగుల ఎత్తైన ఆకర్షణీయ గోపురం నిర్మించారు.

కతోలిక్‌ల పుణ్యభూమి పాటిబండ్ల

పాటిబండ్ల గ్రామానికి కతోలిక్‌ల పుణ్యభూమిగా పేరు. వెయ్యేళ్ల క్రితమే ఈ గ్రామం ఆవిర్భవించినట్టు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. 1830లో రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల నుంచి క్రైస్తవులు ఇక్కడికి వలస వచ్చి స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రామం నుంచి 41 మంది క్రైస్తవ గురువులు, 149 మంది మఠకన్యలు దేశ, విదేశాలకు వెళ్లి దేవుని సేవ చేస్తున్నారు. గుంటూరు పూర్వ పీఠాధిపతి, ప్రస్తుత కడప అపోస్తులిక అడ్మినిస్ట్రేటర్ మహాఘన డాక్టర్ గాలి బాలిది కూడా ఈ గ్రామమే కావడం విశేషం. కతోలిక్ బైబిల్‌ను తెలుగులోకి అనువదించిన గురుశ్రీ పాటిబండ్ల విలియం, సిస్టర్ ఏరువ ఇగ్నేషియస్‌లూ పాటిబండ్ల గ్రామస్తులే కావడం గమనార్హం.

డాక్టర్ గాలిబాలి గురుత్వ వజ్రోత్సవం

ముగ్గురు రాజులు దేవాలయం శత వార్షికోత్సవం సందర్భంగా పాటిబండ్ల గ్రామానికి చెందిన గుంటూరు పూర్వ పీఠాధిపతులు, కడప ఆపోస్తలిక పాలనాధికారి మహాఘన, రెవరెండ్ డాక్టర్ గాలిబాలికి గురుత్వ వజ్రోత్సవం, పీఠాధిపత్య రూబీ జూబిలీ వేడుకులు నిర్వహించనున్నారు. అనంతరం ఆలయం ఆధ్వర్యంలో నిర్మించిన నూతన కల్యాణ మండపం ప్రారంభిస్తారు.

14 మంది పీఠాధిపతుల రాక



శత వార్షికోత్సవాలకు తెలుగు రాష్ట్రాలలోని వివిధ జిల్లాల నుంచి 14 మంది పీఠాధిపతులు, వందలాది మంది విచారణ గురువులు, మఠకన్యలు, భక్తులు వస్తున్నారు. వేలాది మంది క్రైస్తవ సోదరులు వస్తున్నారు. ఏర్పాట్లు పూర్తి చేశాం.
–గురుశ్రీ చిన్నాబత్తిన హృదయ కుమార్, పాటిబండ్ల విచారణ గురువులు

గర్వంగా ఉంది



ముగ్గురు రాజులు దేవాలయం శత వార్షిక ఉత్సవాలు జరుపుకోవడం గర్వంగా ఉంది. గ్రామంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఎక్కడెక్కడి నుంచో గురువులు, మఠకన్యలు, పీఠాధిపతులు మా గ్రామం వస్తున్నారు. వారితో కలిసి దివ్య పూజ బలిలో పాల్గొనుండడం సంతోషంగా ఉంది.
– గురుశ్రీ చిన్నప్పరెడ్డి, చిన్నకాకాని, విచారణ గురువులు

పుణ్యభూమి పాటిబండ్ల..



ఎంతో మందిని గురువులుగా, మఠకన్యలుగా, దైవ సేవకులుగా తీర్చిదిద్దిన ముగ్గురు రాజులు దేవాలయం కలిగిన పుణ్యభూమి పాటిబండ్ల గ్రామం. దైవ చింతనతోపాటు అనేక మంది సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. శత వార్షికోత్సవం అందరితో కలిసి జరుపుకోవడం మరిచిపోలేని అనుభూతి.
–తుమ్మా కరుణకర్‌రెడ్డి, విచారణ గురువులు కోల్పింగ్, గుంటూరు

అమెరికా నుంచి వచ్చా



ముగ్గురు రాజులు విచారణలోని జలాల్‌పురం గ్రామానికి చెందిన నేను ప్రస్తుతం అమెరికాలో విచారణ గురువుగా పనిచేస్తున్నాను. మా దేవాలయం శత వార్షికోత్సవం జరుపుకోవడం సంతోషంగా ఉంది. ఈ వేడుకలను తిలకించేందుకు, దివ్యపూజ బలిలో పాల్గొనేందుకు అమెరికా నుంచి వచ్చా.
–రుద్రపోగు బాలశౌరి, విచారణ గురువు, అమెరికా

దైవసేవలో తృప్తి



మా ముగ్గురు రాజులు దేవాలయం నుంచి నేను మఠకన్యగా దైవ సేవలో ఉన్నాను. చాలా సంతోషంగా ఉంది. ఈ గుడి నుంచి అనేక మంది ఇతర ప్రాంతాలకు దేవుని సేవ నిమిత్తం వెళ్లారు. శత వార్షికోత్సవం తిలకించేందుకు ఇక్కడికి వచ్చా.
–సిస్టర్ పాటిబండ్ల లూర్ధుమేరి, కేరళ

6న సత్తెనపల్లిలో జాబ్ మేళా

సత్తెనపల్లి: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్ అధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 6న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా జరుగు తుందని పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజిరావు శుక్రవారం తెలిపారు. సత్తెనపల్లి నియోజకవర్గ పరిసర ప్రాంత యువత జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని వివరించారు. మేళాలో సుమారు 4 కంపెనీలు పాల్గొంటున్నాయని, ఉదాహరణకు ఐ ప్రాసెస్ సర్వీసెస్-ఐసీఐసీఐ బ్యాంక్, అపెక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్, ఆక్సిస్ బ్యాంక్, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వంటి పలు రకాల కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.11 వేల నుంచి రూ. 30 వేల వరకు ఉండవచ్చన్నారు. ఈ జాబ్ డ్రైవ్‌కు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విభాగాల వరకు చదువుకున్న 18–38 ఏళ్ల వయసు గల నిరుద్యోగ యువత వారి బయోడేటా లేదా రెస్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు రామకృష్ణ రెడ్డి- 80743 93466, అంజిరెడ్డి - 9494986164 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు. ఔత్సాహిక యువత ముందుగా htt pr:// nai punya-m.a p.g-ov.i n/ అనే వెబ్ సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

5న గ్రూప్-1 ఉచిత శిక్షణకు పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద కమ్మ సామాజిక విద్యార్థినులకు గ్రూప్–1 ఉచిత శిక్షణ, వసతి సదుపాయాలను కల్పించనున్నట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ పీవీ లక్ష్మయ్య తెలిపారు. కుందులరోడ్డులోని కమ్మజన సేవా సమితిలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీన గుంటూరులోని జేకేసీ కళాశాలలో, వినుకొండ, హైదరాబాద్‌లలోని తమ సంస్థ కార్యాలయాల్లో ఎంపిక పరీక్ష జరుగుతుందని చెప్పారు. విద్యార్థినులు 83309 34815 నంబరుకు వివరాలను పంపాలని కోరారు. సమావేశంలో కమ్మజన సేవా సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్, సభ్యులు సీతారామయ్య, పెద్ది సాంబశివరావు, చావా బోస్ పాల్గొన్నారు.

కూటమి నేతల రుబాబు

- కప్పం కడితేనే వ్యాపారాలంటూ హుకుం?
- చిరువ్యాపారిపై టీడీపీ నేతలు ఒత్తిడి
- న్యాయం చేయాలని డిమాండ్
- నష్టాన్ని గ్రహించి స్పందించిన ఎమ్మెల్యే


ఉప్పు బ్రహ్మం

నెట్‌వర్క్: కప్పం కడితేనే రోడ్లపై వ్యాపారాలు నిర్వహించడానికి వీలవుతుందని కూటమి నేతలకు తేగేసి చెబుతున్నారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేలు చొప్పున మామూళ్లు ఇస్తేనే రోడ్లపై తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసుకోనిస్తామని, లేకుంటే సహించేది లేదని టీడీపీ నేతలు పేర్కొనడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. గురజాలకు చెందిన ఉప్పు బ్రహ్మం అనే చిరు వ్యాపారిని కూటమి నేతలు బెదిరించి నెలకు రూ.10 వేలు ఇవ్వాలని హుకుం జారీచేయడం చర్చనీయాంశంగా మారింది. వేలకు వేలు ఇవ్వగలిగే స్తోమతే ఉంటే షాపులు అద్దెకు తీసుకుని వ్యాపారాలు నిర్వహించేవారమని ఈ విధంగా రోడ్లపై తోపుడు బండ్లు పెట్టుకుని అష్టకష్టాలు ఎందుకు పడతామంటూ బ్రహ్మం శుక్రవారం వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వ్యాపారాలు చేసుకుంటూ బతుకునీడుస్తున్న తమను ఇలా ఇబ్బంది పెట్టడం తగదని కన్నీరుమున్నీరయ్యారు. కేవలం గురజాలలో కాకుండా పిడుగురాళ్ల నియోజకవర్గంలోని దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం మండలాల్లోనూ కూటమి నేతల అరాచకాలకు అంతే లేకుండా పోతోదని స్థానికులు చెబుతున్నారు. ఏ పని చేయాలన్నా ఏ వ్యాపారం మొదలు కావాలన్నా కూటమి నేతల అనుగ్రహం ఉంటే తప్ప..ముందుకు కదలని పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు.

స్పందించిన ఎమ్మెల్యే యరపతినేని

వీడియో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు స్పందించారు. బాధితుడు ఉప్పు బ్రహ్మం సమస్యను పరిష్కరించారు. షాపు యజమానికి ఎమ్మెల్యే సమాచారం ఇచ్చి ఉప్పు బ్రహ్మం వద్ద తీసుకున్న అద్దె డబ్బులు రూ.10 వేలు తిరిగి చెల్లించేలా చేశారు. తన సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు బ్రహ్మం కృతజ్ఞతలు తెలిపారు.

నిధుల వినియోగంపై పాఠశాలల్లో సామాజిక తనిఖీలు


సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కుళాయిని పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాలలకు మంజూరు చేసిన నిధుల వినియోగం, ఖర్చులు, అవసరమైన మౌలిక వసతులు, చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై సామాజిక తనిఖీలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర శిక్ష అభియాన్ ఉన్నతాధికారులు జిల్లా విద్యా శాఖకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఏపీ సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబులిటీ-ట్రాన్స్‌పరెన్సీ ఏపీ సాట్ ఆధ్వర్యంలో పాఠశాలల వారీగా సామాజిక తనిఖీలు, నిర్వహించాల్సిన విధి విధానాలపై షెడ్యూల్ జారీ చేసింది. ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జమా ఖర్చుల వివరాల పత్రాలు సంబంధిత అధికారులకు అందజేయాల్సి ఉంది. దీనిలో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్టేట్ రిసోర్స్ పర్సన్ పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్మెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి సోషల్ ఆడిట్ వింగ్ నుండి స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎమ్.లోకేష్, జిల్లా రిసోర్స్ పర్సన్ బి.మహేష్ శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరు, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యార్థుల సౌకర్యార్థం అదనపు తరగతి గదుల అవసరం, పొందు పరిచేందుకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకురావడంతో వివరాలను పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్ యాప్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. విద్యాభివృద్ధికి మంజూరు చేసిన నిధులు, వాటి ఖర్చులు వివరాలను సామాజిక తనిఖీలు ద్వారా గుర్తిస్తున్నారు. 2023–24, 2024– 25 విద్యా సంవత్సరాలకు సమకూర్చిన నిధుల వినియోగంపై తనిఖీ విభాగం అధికారులు లెక్కలు తేలుస్తున్నారు. క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన ఇరువురు బృందం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లతా ప్రియదర్శిని నుంచి వివరాలు తీసుకున్నారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

కవి డాక్టర్ కత్తి పద్మారావు


సభలో మాట్లాడుతున్న కత్తి పద్మారావు

పొన్నూరు: దేశంలో స్త్రీ విద్యా విప్లవాన్ని ప్రారంభించిన సాంస్కృతిక యోధురాలు సావిత్రి బాయి పూలే జయంతిని రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని దళిత మహాసభ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కవి డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. శుక్రవారం లుంబినీ వనంలోని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కత్తి పద్మారావు, మాతా రమాబాయి అవార్డు గ్రహీత కత్తి స్వర్ణకుమారి, రీసెర్చ్ సెంటర్ సభ్యురాలు దాసరి శ్యామల, కట్టా సృజన, గేరా ప్రసన్న, రాణి, శాంతి, హేమ, మాధవ్, అక్కిదాసు జాషువా, షబ్బీర్ అలీ, పాల్గొన్నారు. లుంబినీవనంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కత్తి పద్మారావు మాట్లాడుతూ.. మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వంపై ముప్పై ఏళ్లుగా పోరాడుతున్నామని అన్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రకటించడం హర్షణీయమన్నారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను 6వ తరగతి నుంచి ఎంఏ వరకు పాఠ్యాంశంగా పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి స్కూల్లో ఆమె చిత్రపటాలు, విగ్రహాలను ఆవిష్కరించాలని కోరారు. రెండు రాష్ట్రాలలో ఆమె పేరిట మహిళా విశ్వ విద్యాలయాలను నెలకొల్పాలని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



క్రోసూరు: మండలంలోని పీసపాడు గ్రామ శివారులో గురువారం రాత్రి రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ నాగేంద్ర రావు శుక్రవారం తెలిపారు. వివరాలు తెలుపుతూ సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ల గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మయ్య(45) సొంత పనులపై ద్విచక్రవాహనంపై క్రోసూరు వైపు వస్తూ పీసపాడు అడ్డరోడ్డు సమీపంలో గెదెలు తగిలి కింద పడిపోయాడు. తలకు దెబ్బతగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు కలరని, మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేయించి కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏటీఎం ధ్వంసం

చోరీకి విఫలయత్నం


గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసిన నకరికల్లులోని ఇండియా వన్ ఏటీఎం

నకరికల్లు: ఏటీఎంలో చోరీకి గుర్తుతెలియని దుండగులు విఫలయత్నం చేశారు. డబ్బు చోరీ చేసేందుకు వీలుపడకపోవడంతో ఏటీఎం పరికరాన్ని ధ్వంసం చేసి స్క్రీన్, కీబోర్డ్, ఇతర సామగ్రిని పగులగొట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన అండర్‌పాస్ దగ్గర ఇండియా వన్ ఏటీఎంను ఏర్పాటు చేశారు. ఏటీఎం వద్ద సెక్యూరిటీ ఎవరూ ఉండరు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో మాత్రమే ఏటీఎం ఉంటుంది. గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఏటీఎంలోకి ప్రవేశించి డబ్బును చోరీ చేసేందుకు యత్నం చేశారు. డబ్బును బయటకు తీయడం వీలు కాకపోవడంతో కంప్యూటర్ పరికరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. గతంలో కూడా ఇదే ఏటీఎంలో చోరీ జరిగింది. ఘటనపై శుక్రవారం నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

న్యాయవాది కామేపల్లి కృషిబాబుకు ఘన నివాళి


కృషిబాబు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

బాపట్ల: హైకోర్టు న్యాయవాది కామేపల్లి కృషిబాబు తమకు ఆత్మీయుడని మహారాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి వి.కె.పాటిల్ తమ్ముడు రాజేంద్ర వి.కె.పాటిల్ పేర్కొన్నారు. ఇటీవల స్వర్గస్తులైన నరసాయపాలేనికి చెందిన కామేపల్లి కృషిబాబు చిత్రపటానికి శుక్రవారం పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కృషిబాబు తన క్లాస్‌మేట్ అని, ఇద్దరం కలిసే ఉండే వారమని రాజేంద్ర గుర్తు చేసుకున్నారు. కృషిబాబు కుటుంబ సభ్యులు కామేపల్లి భూపాల్‌ను పరామర్శించి సానుభూతి తెలిపారు. నివాళి అర్పించిన వారిలో రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, శాంతారం, మానం విజేత, రాంబాబు ఉన్నారు.

రైల్వే పురస్కార గ్రహీతలకు అభినందన

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ముగ్గురికి జోనల్ స్థాయిలో 69వ రైల్వే వారోత్సవాల్లో విశిష్ట రైల్ సేవా పురస్కారాలు దక్కడంతో వారిని డీఆర్ఎం రామకృష్ణ అభినందించారు. గత నెల 31వ తేదీన సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్‌లో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు కె.సీతారామయ్య, కె.హరిచంద్రుడు, కె.మల్లికార్జునరావులు ఈ అవార్డులు అందుకున్నారని గుర్తుచేశారు.

రైలు పట్టాలపై గాలిపటాలు ఎగురవేయొద్దు

విద్యుదీకరించిన రైల్వే లైన్ల వద్ద గాలిపటాలు ఎగురవేయడాన్ని నివారించాలని డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. రైలు పట్టాలపై ఉన్న ఓవర్ హెడ్ హైటెన్షన్ వైర్లు 25 వేల ఓల్టుల విద్యుత్‌ను సరఫరా చేస్తుంటాయని తెలిపారు.

జీజీహెచ్‌లో రూ.18 కోట్లతో పెట్ సిటీ


పూజలో పాల్గొన్న డాక్టర్ యశశ్వి రమణ, యడ్లపాటి అశోక్‌కుమార్ తదితరులు

గుంటూరు మెడికల్: క్యాన్సర్ రోగులకు శుభవార్త. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు అత్యంత ఖరీదైన, కీలకమైన అత్యాధునిక వైద్య పరికరం గుంటూరు జీజీహెచ్‌లో అందుబాటులోకి రానుంది. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సుమారు రూ.18 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేయనున్న జీఈ కంపెనీ పెట్ సిటి పరికరం ఏర్పాటుకు సంబంధించి టర్న్ కీ పనులకు శుక్రవారం ప్రారంభ పూజ నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ కొబ్బరి కాయ కొట్టి పూజ చేశారు. నాట్కో సమన్వయకర్త యడ్లపాటి అశోక్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గిరిజవోలు దుర్గాప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–2 ఆవుల విజయ, జీఈ ప్రతినిధులు, నాట్కో క్యాన్సర్ సెంటర్ వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు. క్యాన్సర్ రోగులకు రాబోవు ఉగాది నాటికి పెట్ సిటి అందుబాటు లోకి రావచ్చని సూపరింటెండెంట్ తెలిపారు.